www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 9 మే 2023

5

ఏలూరు




ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు చుట్టుపక్కల గ్రామాల మహిళలు రాత్రి సమయాల్లో ఒంటరిగా ప్రయాణించాల్సి వచ్చిన సందర్భంలో వారు ఇబ్బంది పడకుండా జిల్లా ఎస్పి డి.మేరీప్రశాంతి ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్‌ను సోమవారం ప్రారంభించారు. ఒంటరి మహిళలు రాత్రిపూట ప్రయాణ సౌకర్యాల్లేక ఇబ్బందులు పడుతున్న విషయాలను గమనించి, వినూత్న ఆలోచనతో మహిళలకు రాత్రి 10 గంటల నుంచి ఉదయం ఐదు గంటల మధ్య ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ అనే సేవలను ఏలూరు పట్టణంలో ప్రారంభించారు. ఒంటరిగా మహిళలు దూర ప్రాంతాల నుంచి ఏలూరుకు వచ్చి గమ్యస్థానం చేరడానికి రవాణా సౌకర్యం లేకపోతే, పోలీస్ కంట్రోల్ రూమ్ 100/112 లేదా 8332959175కు ఫోన్ చేస్తే ఒక వాహనం మహిళా కానిస్టేబుల్‌తో వచ్చి ఆ మహిళలను గమ్యస్థానాలకు చేర్చుతామన్నారు.

పేరుకే ఉచితం.. గుట్టుగా గుంజుడు..!



ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో పేద పిల్లలకు 25 శాతం ఫ్రీ సీట్లు ఇవ్వాలని నిబంధన

నిబంధనలు అమలు చేయాల్సిందేనని ఇటీవల కోర్టు హెచ్చరిక

ప్రస్తుతం కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

రెండు జిల్లాల్లో 880 వరకూ ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు

ఇప్పటి వరకూ 406 మంది విద్యార్థులకే సీట్లు

ప్రచారం లేకపోవడంతో దరఖాస్తులు రాని దుస్థితి

ఒక కిలోమీటర్ పరిధిలో స్కూల్ ఉంటేనే అవకాశం

ఉచిత సీట్లకు సైతం సాకులు చూపుతూ ఫీజు గుంజుడు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇచ్చే 25 శాతం ప్రవేశాలకు పలు ఫీజులుంటాయ్ అనే రీతిలో స్కూళ్ల యాజమాన్యాలు వ్యవహరిస్తున్న తీరు తల్లిదండ్రుల్లో చర్చనీయాంశమవుతోంది. అదే సమయంలో ఉచిత ప్రవేశాలపై సరైన ప్రచారం లేకపోవడంతో దరఖాస్తులు పెద్దగా రాని పరిస్థితి రెండు జిల్లాల్లోనూ నెలకొంది. దీంతో రెండు జిల్లాల్లోనూ ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల సంఖ్య నామమాత్రంగా ఉంది. విద్యాహక్కుచట్టం 2009 ప్రకారం ప్రతి ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదలకు ఇవ్వాలనే నిబంధన ఉంది. అయితే ప్రభుత్వాలు అమలు చేయించడం లేదు. దీనిపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో గతేడాది నుంచి దరఖాస్తుల ఆహ్వానం సాగుతోంది. ప్రస్తుతం 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ సాగుతోంది. ఏలూరు జిల్లాలో 527, పశ్చిమగోదావరిలో 360 వరకూ ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకూ ఫస్ట్, సెకండ్ ఫేజ్ కింద రెండు విడతల్లో ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ జరిగింది. ఇప్పటి వరకూ ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఏలూరు జిల్లాలో 256 మంది, పశ్చిమలో 204 మంది మాత్రమే ఉన్నారు. రెండు జిల్లాల్లో ఒక్కో స్కూల్‌లో 25 మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం లభించినా 22 వేల మంది పేద విద్యార్థులకు అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకూ సీట్లు పొందిన వారి సంఖ్య చూస్తే వందల్లో కూడా లేదు.

ఉచిత సీటైనా తప్పని ఫీజుల ఒత్తిడి

ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి యాజమాన్యాలు అనేక సాకులు చెబుతూ సొమ్ము గుంజుతున్నాయనే ప్రచారం సాగుతోంది. బహిరంగంగా తల్లిదండ్రులు వెల్లడించలేకపోతున్నప్పటికీ వసూళ్లపై మాత్రం చర్చ సాగుతోంది. ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి అడ్మిషన్ ఫీజు, ఎన్‌రోల్‌మెంట్ ఫీజు పేరిట దాదాపు రూ.మూడు వేల వరకూ వసూలు చేస్తున్నట్లు సమాచారం. స్కూల్ స్థాయిని బట్టి పుస్తకాలకు రూ.ఐదు వేలకుపైగా బాదేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా అనేక కారణాలు చెబుతూ ఫీజు వసూలు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. దీంతో గత్యంతరం లేక కొంతమంది ఫీజులు చెల్లిస్తున్నారు. ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఎటువంటి ఫీజూ చెల్లించొద్దని విద్యా శాఖాధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా పరిస్థితి ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ప్రయివేటులో ఉచిత ప్రవేశాలపై ప్రచారం కరువు

కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలకు సంబంధించి విద్యాశాఖ సరైన ప్రచారం చేయకపోవడంతో దరఖాస్తులు రావడం లేదని తెలుస్తోంది. వాలంటీర్ వ్యవస్థ ఉన్నప్పటికీ దీనిపై సరైన ప్రచారం లేదనే చెప్పాలి. అధికారులు సైతం మీడియా సమావేశాలు పెట్టి వివరించిన పరిస్థితి లేదు. ఏదో మమ అన్నట్లు మాట్లాడి సరిపెడుతున్నారు. కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలపై ఉపాధ్యాయులకు సైతం సరైన సమాచారం లేదంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. రూ.వేలకు వేలు ఫీజు కట్టలేక సతమతమవుతున్న పేద కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఉచిత ప్రవేశాల గురించి ప్రచారం లేకపోవడంతో తెలియని పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఉచిత ప్రవేశం పొందే విద్యార్థి స్కూల్‌కు ఒక కిలోమీటర్ దూరంలో ఉండాలనే నిబంధన సైతం పెనుశాపంగా మారింది. ఈ నిబంధనతో గ్రామాల్లో విద్యార్థులకు ప్రవేశం లేకుండాపోతోంది. మండల కేంద్రం, పట్టణాల్లో ఉన్న కొద్దిమందికి మాత్రమే అవకాశం లభించే పరిస్థితి ఉంది. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకూ సమయం ఉంది. ఇప్పటికైనా ప్రయివేటులో ఉచిత ప్రవేశాలపై పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తే పేద విద్యార్థులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.


ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

రైతులు ఆందోళన చెందొద్దు

మిల్లర్లు సొమ్ము వసూలు చేస్తే మిల్లులు సీజ్ చేస్తాం

ఉంగుటూరు పర్యటనలో రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - ఉంగుటూరు



రైతులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని.. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల అకాల వర్షం కారణంగా ఉంగుటూరు, నాచుకుంటలో ధాన్యం తడిసి రోడ్లపై ఆరబెట్టుకున్న రైతులతో సోమవారం ఆయన మాట్లాడారు. ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందేలా సిఎం జగన్ చర్యలు చేపట్టారని తెలిపారు. ఇప్పటికే రాశులపై ఉన్న ధాన్యాన్ని ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఏ విధమైన సొమ్మును మిల్లర్లకు చెల్లించాల్సిన అవసరం లేదని, డబ్బు వసూలు చేస్తే ఆ సొమ్మును తిరిగి రైతులకు అప్పగించాలని ఫోన్ ద్వారా మాట్లాడి మిల్లు యాజమాన్యానికి తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకూ రైతుల నుండి డబ్బు వసూలు చేసినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు 12 రైస్ మిల్లులను సీజ్ చేశామన్నారు. కృష్ణాజిల్లా నుంచి వర్షానికి తడిసి రోడ్లపై ఆరబెడుతున్న ధాన్యాన్ని పరిశీలించుకుంటూ వస్తున్నానని తెలిపారు. గోనె సంచుల కొరత లేకుండా రైతులకు అవసరమైన మేరకు సమకూర్చాలని సివిల్ సప్లయిస్ డిఎంను మంత్రి ఆదేశించారు. జిల్లాకు లక్ష గన్నీ బ్యాగులు వచ్చాయని, వీటిని జిల్లాలో పంపిణీ చేస్తామని డిఎం మంత్రికి తెలిపారు. ధాన్యం కొనుగోలుకు హమాలీలకు, రవాణాకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని, ఈ ఖర్చులను రైతు భరిస్తే ఛార్జీలను ప్రభుత్వం నేరుగా రైతు ఖాతాలకు జమచేస్తామని చెప్పారు. కోత మిషన్ల వల్ల వర్షాల నష్టం నుండి చాలా వరకూ ధాన్యం రక్షించబడిందన్నారు. ఇంకా కొంతమంది రైతులకు సంబంధించిన ధాన్యం కొనుగోలు ఇప్పటివరకు చేయకపోవడంపై వ్యవసాయ శాఖ అసిస్టెంట్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యాన్ని మిల్లులకు పంపాలని ఆదేశించారు. 15 ఏళ్ల నుంచి బాయిల్డ్ రైస్ కొనుగోలు చేయడంలేదని, తడిసిన ధాన్యాన్ని ఐదు వేల మెట్రిక్ టన్నులను కృష్ణ, ఏలూరు జిల్లాల్లో ఉన్న బాయిల్డ్ మిల్లులకు ధాన్యాన్ని పంపడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో దళారీ వ్యవస్థ లేకుండా ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి నేరుగా ఆన్‌లైన్ ద్వారా వారి ఖాతాలకు సొమ్మును జమ చేసేలా సిఎం చర్యలు చేపట్టారని తెలిపారు. వంగడాలు మార్చి కొత్త వంగడాలను కనిపెట్టడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలతో సిఎం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. లారీల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మంత్రి వెంట సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వై.రామకృష్ణ, ఏలూరు ఆర్‌డిఒ పెంచలకిషోర్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ పోతురాజు, డిఎస్ఒ ఆర్ఎస్ఎస్.రాజు, ఎంపిడిఒ ఆంజనేయబాబు, మండల అగ్రికల్చరల్ ఎఒ వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ శేఖర్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్లు ఎత్తివేయాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉపాధ్యాయులపై అక్రమ కేసులు, సస్పెన్షన్లు ఎత్తివేయాలని ఎపి అమరావతి జెఎసి జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమరావతి జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు వారికి సంబంధం లేని పనులను కేటాయించి ప్రభుత్వం వేధిస్తుందని, ఉపాధ్యాయులు అంటే ప్రతి విద్యార్థికీ మంచి విద్యను అందించి వారిని సమాజంలో ఉన్నతస్థాయిలో ఉండేలా తీర్చిదిద్దేవారన్నారు. అలాంటి ఉపాధ్యాయులతో ఉదయాన్నే పాఠశాలకు వెళ్లగానే టాయిలెట్ల ఫొటోలు తీయాల్సి రావడం, వాటిని వివిధ రకాల యాప్‌లలో అప్‌లోడ్ చేయడం చాలా బాధాకరమైన విషయమన్నారు. చిన్నచిన్న కారణాలకు కూడా ఉపాధ్యాయులను అన్యాయంగా సస్పెండ్ చేస్తున్నారని, ఈ వైఖరి మారాలన్నారు. ఇటీవల సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ చలో విజయవాడ పేరుతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు వారివారి సమస్యల పరిష్కారానికి నిరసన తెలిపే క్రమంలో వారిపై అక్రమంగా కేసులు, బైండోవర్ కేసులను పెట్టడం అన్యాయమని, వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించొద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రెటరి బి.రాంబాబు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.ప్రమోద్‌కుమార్, కె.రవిచంద్రరావు, పంచాయతీరాజ్ ఇంజనీర్ జిల్లా కార్యదర్శి ఆర్.వీరబాబు, వివిధ ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

పారా వెటర్నేరియన్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న పారా వెటర్నేరియన్స్ సమస్యలు పరిష్కరించాలని ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఎపి నాన్- గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ సమావేశం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ పోస్ట్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి రాష్ట్ర నాయకులు ఆర్ఎస్.హరనాథ్, జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు, రాష్ట్ర వెటర్నేరియన్స్ ఫెడరేషన్ అధ్యక్షులు సేవా నాయక్, ఎన్‌జిఒ సంఘం సంయుక్త కార్యదర్శి మెరుగు ఫణికుమార్, తాడేపల్లిగూడెం అసోసియేట్ ప్రెసిడెంట్ పితాని సత్యనారాయణ పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

జంగారెడ్డిగూడెం: ప్రతిఏటా వేసవిలో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని మహిళలు ఖాళీ బిందెలతో మండలంలోని నాగులగూడెం గ్రామస్తులు రోడ్డుపై సోమవారం నిరసన తెలిపారు. గ్రామంలో మూడు రోజులుగా తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. గ్రామపంచాయతీ ద్వారా సరఫరా చేసే నీటిని సకాలంలో విడుదల చేయడం లేదని మహిళలు వాపోయారు. కూలీనాలి చేసుకునే పేదలు సకాలంలో నీటి సరఫరా లేకపోవడం వల్ల ఉపాధిని కూడా కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల దృష్టిసారించి నాగులగూడెంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు నాగలక్ష్మి, పోచమ్మ, గంగారత్నం, మణికుమారి, కుమారి పాల్గొన్నారు.

'ఉపాధి'ని దూరం చేసేందుకే నిధుల కేటాయింపులో కోత

ఉపాధి హామీ చట్ట పరిరక్షణ జిల్లా యాత్రలో నేతలు - ఐదో రోజుకు యాత్ర

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం రకరకాల నిబంధనలు తీసుకొస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.నరసింహ విమర్శించారు. ఉపాధి హామీ పరిరక్షణకు వ్యకాస ఆధ్వర్యాన చేపట్టిన యాత్ర ఐదో రోజు నూజివీడు మండలంలోని మొర్సపూడి, గొల్లపల్లి, మీర్జాపురం, ముఖసానరసన్నపాలెం, పల్లేర్లమూడి గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఉపాధి పనిప్రదేశాల్లో కూలీలను కలిసి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ, ఎన్.నరసింహ మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టానికి 2023-24 కేంద్ర బడ్జెట్‌లో నిధులను భారీగా తగ్గించిందన్నారు. వంద రోజుల పని కల్పించేందుకు ఉపాధి హామీకి రూ.2.72 లక్షల కోట్లు అవసరమని ఒక అంచనా వేసిన కేంద్ర ప్రభుత్వం ఆ మేర నిధులు పెంచకపోవడం దుర్మార్గమన్నారు. కేవలం రూ.60వేల కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. కూలీలకు వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చెల్లించే ఉపాధి కూలీల వేతనాల వాటాను కూడా 60:40 (కేంద్రం:రాష్ట్రం) నిష్పత్తిలో పంచుకోవాలని ప్రభుత్వం చెప్పడం ప్రమాదకరమైన నిర్ణయమన్నారు. భవిష్యత్తులో ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే కుట్రలో భాగమే ఇలాంటి నిర్ణయాలు చేస్తున్నారని తెలిపారు. బడా కార్పొరేట్ సంస్థలకు ఏటా లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలు, మినహాయింపులు వర్తింపజేసేందుకు వెనుకాడని మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి తగినన్ని నిధులు కేటాయించడానికి సుముఖంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం పేదల కోసం కాకుండా ధనికులు, కార్పొరేట్‌ల ప్రయోజనాల కోసం పనిచేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. పని దినాల సంఖ్యను 200 రోజులకు పెంచాలని, అడిగివారికి పనులు చూపాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనితో పాటు పట్టణాల్లోనూ ఉపాధి పనులు చూపాలని, దీనికోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పి.మురళీ, ఎస్.మహంకాళీ, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రాజశేఖర్, దాసు పాల్గొన్నారు.



చాట్రాయిలో..

టి.నరసాపురం : ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మానుకొండ జీవరత్నం డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ చేపట్టిన ఉపాధి హామీ రక్షణ యాత్ర మండలంలోని అప్పలరాజుగూడెం, మధ్యాహ్నపువారిగూడెం, సాలిగూడం, అబ్బుల్లాపురం, మల్లప్పగూడెం, బచ్చులేటిగూడెం, రామమ్మగూడెం, అల్లూరి సీతారామరాజునగర్‌లో సాగింది. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాలమ్మ, తుమ్మల సత్యనారాయణ, కారం నాగదుర్గ, మడకం సుధారాణి, యాగంటి సీత పాల్గొన్నారు.



టి.నరసాపురంలో..

జీలుగుమిల్లి : 'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన యాత్ర మండలంలోని తాటియాకులగూడెం, వంకవారిగూడెం, కామయ్యపాలెంలో సాగింది. యాత్ర నాయకులు కూలీల వద్దకు వెళ్లి సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం, రాష్ట్ర కమిటీ సభ్యులు తామ ముత్యాలమ్మ మాట్లాడుతూ ఈనెల పదో తేదీన జంగారెడ్డిగూడెంలోని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కె.నాగదుర్గ, పాముల పాపారావు, తుమ్మల సత్యనారాయణ, గూడెల్లి వెంకట్రావు, మడకం గాయత్రి పాల్గొన్నారు.



నూజివీడు మండలంలో..

చాట్రాయి : ఈనెల 13వ తేదీన నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ చట్ట పరిరక్షణకు చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చేపట్టిన యాత్ర మండలంలోని చిన్నంపేటకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి చూపాలని, పే స్లిప్పులు ఇవ్వాలని, పనిప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేయాలని, ఎఎన్ఎంను, ఆశా కార్యకర్తను కేటాయించాలని, ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.హోలీ మేరీ, కెవిపిఎస్ మండల కార్యదర్శి కొమ్ము ఆనందం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఉపాధి హామీలో ప్రవేశపెట్టిన నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటో విధానాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పరిరక్షణ జిల్లా యాత్ర ఆదివారం రాత్రి ఆగిరిపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యకాస నాయకులు పిల్లి మురళీ, చాకిరి శివనాగరాజు, సత్తు కోటేశ్వరరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

రూ.297 కోట్ల విలువైన రబీ ధాన్యం కొనుగోలు

1.50 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ

రైతుల ఖాతాల్లో రూ .182 .42 కోట్లు జమ

సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ల ఏర్పాటు

సమీక్షా సమావేశంలో జెసి లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ప్రస్తుత రబీ పంటకు సంబంధించి ఇప్పటి వరకూ రూ.1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు, తడిసిన ధాన్యం కొనుగోలు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. సమావేశం అనంతరం జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి మాట్లాడుతూ ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సిఎం జగన్ జిల్లా అధికారులను ఆదేశించారన్నారు. జిల్లాలో రబీ పంటకు సంబంధించి ఇంతవరకూ 12,581 మంది రైతుల నుంచి రూ.297 కోట్ల విలువైన 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు సేకరించామని చెప్పారు. ప్రస్తుతం ఇంతవరకూ రూ.182.42 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ధాన్యం సేకరించిన 21 రోజుల్లోపే రైతుల ఖాతాకు సొమ్ము జమ కావడంతో ఆన్‌లైన్‌లోనే ధాన్యం సేకరించాలని రైతులు కోరుతున్నారన్నారు. ధాన్యం సేకరణలో తొలుత 75 బస్తాలున్న పరిమితిని రైతుల విజ్ఞప్తి మేరకు 92కు ఆ తర్వాత వందకు, ప్రస్తుతం 105కు ప్రభుత్వం పెంచిందన్నారు. జిల్లాలో 136 రైతు భరోసా కేంద్రాల ద్వారా సుమారు పది వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. దీనికోసం నిత్యం 400 నుంచి 500 వరకూ లారీలు, ట్రాక్టర్లు రవాణా సదుపాయానికి వినియోగిస్తున్నామన్నారు. మరో పది రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తవుతుందని చెప్పారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో గత కొద్దిరోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు 1890 మెట్రిక్ టన్నులు ధాన్యం తడిసి మొలకెత్తి దెబ్బతినిందని జిల్లా వ్యవసాయ శాఖ తెలిపిందన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ స్థితిగతులను పరిశీలించేందుకు ప్రభుత్వం జలవనరుల శాఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్‌ను జిల్లా ప్రత్యేకఅధికారిగా నియమించారని పేర్కొన్నారు. ఈ మేరకు శశి భూషణ్‌కుమార్ ఈ నెల ఆరు, ఏడు తేదీల్లో జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించారని, రైతు భరోసా కేంద్రాలను సందర్శించి, ధాన్యంలో తేమ, నూక శాతాలను కూడా పరిశీలించి, దెబ్బతిన్న, మొలకెత్తిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతుల ఆందోళన చెందొద్దని తెలిపి, అలాంటి ధాన్యాన్ని తక్షణం రైస్ మిల్లులకు తరలించడానికి ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారని తెలిపారు.

వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యం 15 వేల మెట్రిక్ టన్నుల వరకూ ఉండొచ్చన్నారు. జిల్లాలో ఎగువ, మెరక ప్రాంతమైన చింతలపూడి మండలంలో ధాన్యంలో నూక శాతం అధికంగా ఉన్న కారణంగా ఆ ధాన్యం కృష్ణా జిల్లాలోని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రైతుల ఫిర్యాదులను స్వీకరించేందుకు, వాటిని పరిష్కరించేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూము (08812-230448, 7702003584, 7569562076, 7569597910, 8500730430) నెంబర్లు ఏర్పాటు చేశామన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతానికి చర్యలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు:రైతు భరోసా కేంద్రాల ద్వారా మండలాల్లో మిగిలి ఉన్న ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం గోదావరి సమావేశ మందిరంలో జెసి బి.లావణ్యవేణి, డిఆర్ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, జెడ్‌పిసిఇఒ రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణరెడ్డి, సత్యనారాయణరెడ్డితో కలిసి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పందన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు రెండు, మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశాలున్నందున, మిగిలిన ధాన్యం కొనుగోలును తహశీల్దార్లు కొనుగోలును వేగవంతం చేయాలని ఆదేశించారు. గన్నీ బ్యాగులు, హమాలీలు, రవాణా వంటివి కొనుగోలులో ముఖ్యమని వీటికి ప్రణాళికయుత ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులు కొనుగోలుపై దృష్టిసారించాలన్నారు. ధాన్యం శాంపిల్స్‌ను, తేమ శాతాన్ని గుర్తించడానికి సచివాలయ సిబ్బంది నేరుగా పొలాలకు వెళ్లి శాంపిల్స్ శాతాన్ని సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ స్పందన కార్యక్రమానికి 283 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు : గన్ని

ఉంగుటూరు:ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టొదని టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కైకరం, రామన్నగూడెం, వెంకటకృష్ణాపురం గ్రామాల్లో తడిసిన ధాన్యం రాశులను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం ధాన్యం రాశులపై కూర్చుని నిరసన తెలిపారు. ఆర్‌డిఒ, సివిల్ సప్లయిస్ డిఎం, డిఎస్ఒలతో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యలు వివరించారు. రైతులకు అవసరమైన గోనె సంచులను తక్షణం ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేస్తామన్నారు. కైకరం గ్రామానికి రూ.30 వేల సంచులిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం గన్ని మాట్లాడుతూ విపత్తులనేవి సహజమని, కానీ మనమానవ ప్రయత్నమేదీ, కష్టాల్లో ఉన్నప్పుడు వచ్చి ఓదార్చి భరోసా కల్పించాలిగాని ఇళ్ళల్లో పడుకుంటే ఎలా అందుకేనా అధికారం ఇచ్చిందని వైసిపిని ప్రశ్నించారు. చింతలపూడి మాజీ శాసనసభ్యులు ఘంటా మురళీ పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలని వంటా-వార్పు

ఏలూరు:కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన గ్యాస్ ధరలను తక్షణం తగ్గించి రూ.500కే గ్యాస్ సిలిండర్లు అందించాలని ఎపి మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కన్వీనర్ కొండేటి బేబి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఆధ్వర్యంలో ధరలు నియంత్రించాలని కోరుతూ వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ రూ.500కే ఇవ్వాలని, మహిళలపై దాడులు అరికట్టాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య జిల్లా కన్వీనర్ కొండేటి బేబి మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని, మహిళలపై అత్యాచారాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. గతంలో గ్యాస్ ధర రూ.400 ఉండేదని, బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.1200కు చేరిందన్నారు. దీంతో పేద ప్రజలు బతకడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సమాఖ్య ఏలూరు కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మి ఇందిర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత కారణంగా పేద ప్రజలు రోడ్డున పడ్డారని విమర్శించారు. ఐద్వా నగర కన్వీనర్ హైమావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసర ధరలను నియంత్రించి అందుబాటులోకి తెచ్చి మహిళలపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రత్యక్షంగా ప్రభుత్వం కారణమవుతుందని విమర్శించారు.

ఎసిబి వలలో ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి నానాటికీ ఎక్కువైపోతోంది. తమ సొంత ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా కూడా డబ్బులు డిమాండ్ చేసే పరిస్థితికి సబ్ రిజిస్టర్ అధికారులు సన్నద్ధమయ్యారు. తన భార్య పేరున ఉన్న ఆస్తిని గిఫ్ట్ డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేసేందుకు ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లగా అతని వద్ద నుంచి రిజిస్టర్ అధికారులు డబ్బులు డిమాండ్ చేయడంతో చేసేదేమీ లేక అతను అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. అవినీతి నిరోధక శాఖ అధికారులు వల పని అధికారిని, అతని అసిస్టెంట్‌ని పట్టుకొని రూ.పది వేలు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఏలూరు ఎసిబి డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... పెదవేగి మండలంలోని కూచింపూడి గ్రామానికి చెందిన రాంబాబుకు ఆ గ్రామంలో ఇల్లు ఉంది. ఆ ఇల్లును తన భార్యపేరున గిఫ్ట్ డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేసేందుకు నిర్ణయించుకున్నాడు. ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి అధికారులను రిజిస్ట్రేషన్ చేయటానికి వివరాలు అడిగారు. ఇందుకు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ డబ్బులు డిమాండ్ చేశాడు. రూ.15వేలు ఇస్తేనే ఆస్తిని రిజిస్ట్రేషన్ చేస్తామని స్పష్టం చేశారు. తాను అంత సొమ్ము ఇవ్వలేనని బతిమిలాడగా ఆఖరికి రూ.పది వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్‌గా ఉండే సబ్ రిజిస్టర్ అనారోగ్యంతో సెలవులో ఉండగా, రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ సూపరింటిండెంట్ బళ్లారి జోగేశ్వరరావు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్టర్‌గా విధుల్లో ఉన్నారు. జోగేశ్వరరావు రూ.పది వేలు ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పడంతో బాధితుడు రాంబాబు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏలూరు ఎసిబి అధికారులు రంగంలోకి దిగారు. సోమవారం యధావిధిగా రాంబాబుకు రూ.పది వేలు ఇచ్చి లోపలికి పంపారు. ఇన్‌ఛార్జి సబ్ రిజిస్టర్ జోగేశ్వరరావు వ్యక్తిగతంగా కార్యాలయంతో సంబంధం లేకుండా గొల్లాయిగూడేనికి చెందిన ఐనవల్లి క్రాంతికుమార్‌ను అసిస్టెంట్‌గా పెట్టుకున్నాడు. రాంబాబు రూ.పది వేలు తీసుకుని రాగా డబ్బులు క్రాంతికుమార్‌కు ఇవ్వాలని చెప్పాడు. సొమ్ము క్రాంతికుమార్ జేబులో పెట్టుకున్న అనంతరం ఎసిబి అధికారులు ఒక్కసారిగా దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సొమ్మును ప్రత్యేకమైన ద్రావకంతో పరీక్షించి నిర్ధారించారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపర్చుతామని ఎసిబి డిఎస్‌పి ప్రసాద్ తెలిపారు. ప్రజలు అవినీతిని ప్రోత్సహించకూడదని, ఎవరైనా ప్రభుత్వ అధికారులు, సిబ్బంది లంచం అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ దాడుల్లో ఎసిబి సిఐలు యేసుబాబు, భాస్కరరావు, నాగేంద్రప్రసాద్ ఉన్నారు.

సొసైటీ పెట్రోల్ బంకు ప్రారంభం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండల కేంద్రమైన ద్వారకాతిరుమల గ్రామంలో సోమవారం ఉదయం వెంకటేశ్వర విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ సొసైటీ పెట్రోల్ బంకును గోపాలపురం ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు సోమవారం ప్రారంభించారు. 1989లో ఏర్పాటు చేసిన ఈ పెట్రోల్ బంకును ప్రస్తుత సొసైటీ అధ్యక్షులు గుర్రాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో అధునాతన పెట్రో పంపింగ్ మెషనరీతో ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు పెట్రోల్ బంకును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కుంటం స్వర్ణలత, ఎంపిపి బొండాడ మోహిని, జెడ్‌పిటిసి సభ్యులు చిగురిపల్లి శామ్యూల్, వైసిపి నాయకులు బి.వెంకన్నబాబు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఉక్కుర్తి వెంకట్రావు, చెలికాని రాజబాబు, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, చెన్నూరి రామకృష్ణ, ఇమ్మడి నాగు, అంబటి గాంధీ, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం మండల ప్రజా సంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ అధ్యక్షత వహించగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న రెజ్లర్ల మహిళా క్రీడాకారులకు అండగా నిలవాల్సిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కంచె చేను మేసినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. కాపాడాల్సిన అధ్యక్షుడే లైంగిక వేధింపులకు పాల్పడుతుంటే వారి సమస్యలను ఎవరు పరిష్కరించాలని ప్రశ్నించారు. క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలని జనవరి నెలలో ఆందోళనకు దిగితే ప్రభుత్వం కమిటీ వేసి విచారిస్తామని హామీ ఇచ్చి నాలుగు నెలలైనా పట్టించుకోకపోవడంతో కొన్నిరోజుల క్రితం ఏడుగురు మహిళా రెజ్లర్ల క్రీడాకారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారన్నారు. కోర్టు సైతం తక్షణమే ఢిల్లీ పోలీసులు స్పందించి చర్య తీసుకోవాలని ఆక్షేపించింది. అయినా బిజెపి ఎంపీని కాపాడడం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం రెజ్లర్ల ఆందోళనకు స్పందించి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పేద కుటుంబానికి జనసైనికుల వితరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఇటీవల మృతి చెందిన మండలంలోని మరిబంధం గ్రామానికి చెందిన లంకా రమణ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి జన సైనికులు సోమవారం ఆర్థిక సాయం చేశారు. జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ ఆధ్వర్యంలోని సభ్యులు పరిశీలించి తక్షణ సాయంగా రూ.పది వేలు అందించారు. రమణ కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిజ్రాలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో హిజ్రాలకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉత్సవాలు, వేడుకలు, ప్రారంభోత్సవాల సమయాల్లో హిజ్రాలతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని బాధితులు ఫిర్యాదు చేశారని రూరల్ సిఐ ఆర్.అంకబాబు తెలిపారు. ఎవరిని ఇబ్బంది పెట్టకుండా సాంప్రదాయ బద్ధంగా హిజ్రాలు తమ జీవనాన్ని కొనసాగించాలని ఆయన సూచించారు. ఇతరులకు ఇబ్బంది తలెత్తితే కఠినమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పచ్చిరొట్ట సాగుతో నేలలు సారవంతం

ప్రజాశక్తి - టి.నరసాపురం

పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయడం ద్వారా నేలలు సారవంతమవుతాయని మండల విద్యాశాఖాధికారి డి.ముత్యాలరావు తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలోని పచ్చిరొట్ట విత్తనాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగ 450 క్వింటాళ్లు, జనుము 75 క్వింటాళ్లు, పిల్లిపెసర 250 క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి రైతు పచ్చి రొట్ట విత్తనాలు సాగు చేసి ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు.. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాలకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకెళ్లి వేలిముద్ర వేసి పచ్చిరొట్ట విత్తనాలు తీసుకెళ్లాలని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ సోమవారం విలేకర్లకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రుద్రకోటరాజుగూడేనికి చెందిన బిరుదుగడ్డ రామకృష్ణ స్థానిక ఎర్రకాలువలోని ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఇబి, పోలీస్‌సిబ్బందికి అందిన సమాచారం మేరకు దాడిచేశారు. ఈ దాడిలో ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ధాన్యం సేకరణ లక్ష్యం పెంపు

రైతుల ఒత్తిడితో అదనంగా 10 వేల టన్నులు పెంచిన ప్రభుత్వం

పూర్తిగా అందని తొలివిడత సొమ్ము



రవాణాకు సిద్ధం చేసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి, తహశీల్దార్

ప్రజాశక్తి - భీమడోలు

రైతుల ఒత్తిడితో ప్రభుత్వం భీమడోలు మండలంలో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని మరొక పది వేల టన్నులకు పెంచింది. గతంలో పౌరసరఫరాల సంస్థ తొలుత 33 వేల టన్నులు ఆ తర్వాత మరొక వెయ్యి టన్నులు కలిపి 34 వేల టన్నులు ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించింది. ఈ మేరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఇంకా మండలంలో 15 వేల టన్నులకు పైబడి ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉందని అంచన. మండలంలో 13,200 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు జరగగా ప్రభుత్వం 57 వేల టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా కట్టింది. కాని ఆ తర్వాత పౌరసరఫరాల సంస్థ ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 34 వేలకు మాత్రమే పరిమితం చేసింది. ఈ మేరకు సిద్ధం చేసిన 8.90 లక్షలు గోనె సంచులను పంపిణీ చేశారు. ఆ మేరకు ధాన్యం ఎగుమతి జరిగింది. దీంతో గోనె సంచుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నియంత్రించారు. మిగులు ధాన్యం కొనుగోలు విషయమై రైతుల ఒత్తిడి పెరిగింది. దీంతో పాటు తమ అవసరం మేరకు గోనె సంచులను సరఫరా చేయాలని, ధాన్యం రవాణా కోసం వాహనాలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఇదే విషయమై ఎపి రైతు సంఘం, సిపిఎం రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం మరొక పదివేల టన్నులు ధాన్యం కొనుగోలుకు అనుమతించింది. ఇప్పటికే కొంతమంది రైతులు ధాన్యాన్ని ప్రయివేట్ వ్యక్తులకు అమ్మిన నేపథ్యంలో ప్రస్తుతం నిర్ణయించిన లక్ష్యంతో రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యం కొనుగోలు పూర్తవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద మిగిలి ఉన్న గోనె సంచుల పంపిణీ పోను ఐదు వేల టన్నుల ధాన్యం సేకరణకు 1.25 లక్షల గోనె సంచులు తెచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇదే క్రమంలో తొలివిడతగా ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు రూ.59.87 కోట్లు చెల్లించవలసి ఉండగా ఇప్పటివరకు రూ.42.92 కోట్లు చెల్లించామని అధికారులు అంటున్నారు. ఏది ఏమైనా రైతుల వద్ద మిగిలిన ధాన్యం కొనుగోలు కోసం అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన గోనె సంచులను సరఫరా చేయడంతో పాటు ధాన్యం రవాణా విషయమై ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయాలపై వాతావరణ పరిస్థితులపై సైతం అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

అల్లూరి సేవలు చిరస్మరణీయం



ఏలూరులో బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంలో వైఎంహెచ్ఎ హాలులో సోమవారం నిర్వహించారు. హేలాపురి సింగర్స్ అసోసియేషన్ గాయకులు అభ్యుదయ సినీ గేయాలతో అలరించారు. 25 మంది అల్లూరి సీతారామరాజు వేషధారణతో కూడిన విద్యార్థుల బృందం "రగిలింది విప్లవాగ్ని ఈరోజు" అనే పాటకు అనుగుణంగా ప్రదర్శన ఇచ్చారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి రచయిత కూనపరాజు కుమార్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు ఆలపాటి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అక్షరం ఆర్ట్స్ డి.రాములు, మజ్జి కాంతారావు, మేతర అజయ్‌బాబు, పి.కస్తూరిబాయ్, జి.శారద, పి.హైమావతి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, సాయిబాబు పాల్గొన్నారు. సభకు హేలాపురి సింగర్స్ అసోసియేషన్ గాయకులు అర్జున్‌రావు స్వాగతం పలకగా ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించారు. సభలో ప్రధాన వక్తగా పాల్గొన్న కూనప రాజుకుమార్, అక్షరం ఆర్ట్స్ డి.రాములు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, గుడిపాటి నరసింహారావు మాట్లాడారు. అనంతరం సభలో ఆ అగ్ని పేరు అల్లూరి సీతారామరాజు బుక్లెట్‌ను ఆవిష్కరించారు. ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కళాకారులందర్నీ పుస్తకాలు ప్రశంసాపత్రాలు మెమెంటోలతో అభినందించారు.

పవర్‌పేట సిపిఎం జిల్లా కార్యాలయంలో అల్లూరి వర్ధంతి సభ సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ సీతారామరాజు దేశంలో గిరిజనుల కోసం ఆనాడే పోరాడి వారికి భూములు సాధించి పెడితే, నేటి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అటవీ భూములను తిరిగి మళ్లీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని విమర్శించారు. దీంతో రాజ్యాంగం కల్పించిన అటవీభూములపై గిరిజనుల హక్కులు కాలరాయపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో గిరిజన చట్టాల అమలకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు, ఎ.శ్యామలారాణి, నాయకులు పి.ఆదిశేషు, సిపిఎం ఏలూరు నగర కమిటీ సభ్యులు బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, కట్టా సత్యనారాయణ, వి.శైలజ, నాయకులు జె.గోపి, పి.జానుబాబు, బి.త్రినాధ్, మీసాల సత్యనారాయణ, సింహచలం పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : అల్లూరి వర్ధంతి సందర్భంగా పిడిఎస్‌యు, ఇఫ్టు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జూట్‌మిల్ సెంటర్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి, నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఇఫ్టు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ సహజ వనరుల్ని అంబాని, ఆదాని వంటి కార్పొరేట్లకి అప్పగిస్తున్న మోడీ ప్రభుత్వంపై అల్లూరి పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని కోరారు. నూతన అటవీ హక్కుల చట్టంతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను అడవి నుంచి తరిమి వేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకినాని మాట్లాడుతూ దేశంలో అసమానతలు, నిరుద్యోగం పెద్దఎత్తున పెరుగుతుందన్నారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతు, కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టు జిల్లా కార్యదర్శి బద్ద వెంకట్రావు, ఇఫ్టు నగర అధ్యక్షులు యెర్రా శ్రీను, పిడిఎస్‌యు నగర అధ్యక్షులు ఎం.క్రాంతి, సభ్యులు తేజ పాల్గొన్నారు.

చాట్రాయి : వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సోమవారం చిన్నంపేట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ అల్లూరి ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ చాట్రాయి మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.హెూలీమేరీ, సామాజిక చైతన్య వేదిక ఆర్గనైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులు ఉత్తమ భావిపౌరులుగా తయారు కావడానికి, విద్య ద్వారా ఉన్నత స్థానాలను చేరేందుకు గ్రంథాలయాల సేవలను వినియోగించుకోవాలని భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగా కోరారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భీమడోలు శాఖా గ్రంథాలయం కేంద్రంగా నేటి నుంచి జూన్ 11వ తేదీ వరకు 40 రోజుల పాటు కొనసాగే వేసవి విజ్ఞాన శిబిరాన్ని జెడ్‌పిటిసి సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇతర ప్రముఖులతో కలిసి వేసవి విజ్ఞాన శిబిరం వాల్‌పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. భీమడోలు లయన్స్ క్లబ్ కోశాధికారి పివివి.సత్యనారాయణ (సత్యేంద్ర మాస్టారు) విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు నోటు పుస్తకాలను అందించారు. మానవత భీమడోలు శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు సంస్థ తరపున గ్రంథాలయానికి రూ.ఐదు వేల విలువైన పుస్తకాలు అందించేందుకు ముందుకు వచ్చారు. గ్రంథాలయ అభివృద్ధి సంఘ వైస్ ప్రెసిడెంట్ మద్దాల అప్పారావు, రామకుర్తి నాగేశ్వరరావు, సుతాపల్లి ప్రసాద్, విజ్ఞాన శిబిరంలో ముఖ్య రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించనున్న సామాజికవేత్త మండే సుధాకర్ పాల్గొన్నారు. పూళ్ల శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు డిఎన్‌బి.అమరనాథ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరాలకు ముఖ్య అతిథిగా మానవత భీమడోలు శాఖ అధ్యక్షుడు పచ్చ వెంకటేశ్వరరావు, పివి.కృష్ణారావు పాల్గొన్నారు. శిబిరంలో నిర్వహించే విజ్ఞాన శిబిరం తరగతులకు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించే అన్నే వారి గూడెం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు మస్తాన్ పాల్గొన్నారు. గుండుగొలను శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు జి.నాగమణి ఆధ్వర్యంలో ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమాన్ని యుటిఎఫ్ సీనియర్ నాయకులు బి.సింహాచలం ప్రారంభించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఎన్.శంకర్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మండలంలోని గొల్లపల్లిలో ఉన్న బ్రాంచ్ లైబ్రేరీలో సోమవారం సమ్మర్ క్యాంపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ అన్నే రామకృష్ణయ్య జెడ్‌పి హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయులు ఎ.నాగిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో సంక్షిప్తంగా విద్యా బోధన ఉంటుందని, సువిశాలమైన విజ్ఞాన బండాగారం గ్రంథాలయాల్లో నిక్షిప్తం కాబడిందని తెలిపారు.

ముదినేపల్లి : విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరం సద్వినియోగం చేసుకోవాలని అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి కోరారు. ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో మే ఎనిమిదో తేదీ నుంచి జూన్ 11వ వరకు నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరానికి తొలిరోజు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ విద్యార్థుల కోసం ఇండోర్ గేమ్స్ చెస్ బోర్డు, క్యారం బోర్డు, వాలీబాల్, రింగ్స్, స్కిప్పింగ్స్‌త్రెడ్స్ తదితర ఆట వస్తువులు గ్రంథాలయ అధికారిణి ఎం.శ్రీదేవికి అందించారు.

చింతలపూడి : విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని చింతలపూడి గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలిప్ అన్నారు. చింతలపూడి గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపును ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్ ఇమ్రాన్, మండల సచివాలయాల ఇన్‌ఛార్జి శ్రీను, ముస్లిం మైనారిటీ సెక్రటరీ రెహ్మాన్, లైబ్రరీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముదినేపల్లిలో...


ఆగిరిపల్లి : పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆగిరిపల్లి గ్రామ ప్రముఖులు చౌటపల్లి లక్ష్మీవిక్టర్‌బాబు అన్నారు. ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన సోమవారం ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.నాగేశ్వరరావు, పి.నరసయ్య, కృష్ణారావు పాల్గొన్నారు.

చాట్రాయి : చాట్రాయి గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి జూన్ ఎనిమిదో తేదీ వరకు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరం చాట్రాయి గ్రంథాలయంలో సోమవారం ప్రారంభించినట్లు లైబ్రేరియన్ బి.మణికంఠ తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు ప్రతిరోజు వివిధ రకాల అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ శిబిరాన్ని చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సత్యనారాయణ రెడ్డి ప్రారంభించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

గత 25 ఏళ్లుగా వణుదుర్రు గ్రామంలో దళితులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ ఎంఎల్ఎ డిఎన్ఆర్‌ను కోరారు. ఈ మేరకు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావును సోమవారం కైకలూరులోని ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాధవ మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు లేవని, మంచినీరు, డ్రెయినేజీ సమస్యలతో పాటు శ్మశానవాటికకు స్తంభాలు ఏర్పాటు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. కొత్తపల్లి నుంచి వణుదుర్రు, దేవపూడి వరకు రోడ్ల వెంబడి విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, గ్రామంలోని మెట్ల రేవును అభివృద్ధి చేయాలని, నడవడానికి వంతెన సౌకర్యం ఏర్పాటు, ప్రజలు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయాలని డిఎన్ఆర్‌ను కోరారు. సమస్యలపై డిఎన్ఆర్ సానుకూలంగా స్పందించినట్లు మాధవ తెలిపారు. మాధవతో పాటు బొడ్డు సురేష్ ఉన్నారు.



డిఎన్ఆర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాధవ

మైసన్నగూడెం రోడ్డు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని మైసన్నగూడెం రహదారి నిర్మించాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, పార్టీ మండల అధ్యక్షులు ఎస్.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ ఝాన్సిరాణికి టిడిపి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్యామ్ చంద్రశేషు, సత్యనారాయణ మాట్లాడుతూ మైసన్నగూడెం రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైసిపి రోడ్డు నిర్మాణం చేపడతామని స్థానిక ఎంఎల్ఎ ఎలిజా అనేకసార్లు ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. గతేడాది డివిజనల్ స్థాయి స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయగా 30 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పి 30 రోజుల తర్వాత మీ సమస్య పరిష్కారమైందని ఫోన్‌లో మెసేజ్‌లు పంపడం సరికాదని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.3.88 కోట్ల నిధులు మంజూరైనప్పటికీ నిర్మాణం మాత్రం చేపట్టలేదన్నారు. అనంతరం టిడిపి నేతలు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. త్వరలో రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే భారీ ఎత్తున జన సమీకరణ చేసి ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, మండల తెలుగు రైతు అధ్యక్షుడు ఎలికే వరప్రసాద్, మండల ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి తాళ్లూరు వెంకటేశ్వరరావు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కోనేటి చంటి పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న టిడిపి నేతలు

కల్లాల్లో మిర్చి పంట పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని వలసపల్లిలో కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంటను ఇన్‌ఛార్జి ఉద్యానవన శాఖ అధి కారి ఆర్.హేమ ఆధ్వర్యంలో గుంటూరు కమిషనరేట్ సహా య సంచాలకులు ఆర్.రాంబాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు పంట చేతి కి వచ్చేసి అమ్ముకునే సమయంలో వర్షాలు పడటం వల్ల నిల్వ చేసుకునే పద్ధతులు సస్యరక్షణ చర్యలు ఎలా చేపట్టాల నే వాటిపై రైతులకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏలూరు ఉద్యానవన శాఖ అధికారి జె.శాంతి, రైతులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ముదినేపల్లి : ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు సోమవారం నగదు విరాళంగా అందించారు. మండలంలోని అల్లూరు హరిజనవాడలో కోదండ రామాలయం పనర్ ప్రతిష్ఠ నిమత్తం కోదండ రామాలయం సింహాద్వారానికి బికెఎం నాని ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.15 వేలు, రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజర్ సెక్రటరీ పూల రామ చంద్రరావు రూ.15 వేలు, కైకలూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దావు నాగరాజు రూ.15వేలు మొత్తం రూ.45వేలు చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

ఎస్ఆర్ఆర్ బోయ్స్ హైస్కూల్ విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పదో తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన నూజివీడు పట్టణ పరిధిలోని ఎస్ఆర్ఆర్ జెడ్‌పి బోయ్స్ హైస్కూల్ విద్యార్థులను పాఠశాల ఆవరణలో సోమవారం సన్మానం చేశారు. విద్యార్థులకు పాటు వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ భగవతుల హేమలత మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఫలితాలు సాధించటం అభినందనీయమన్నారు. బంగారు భవితకు ప్రభుత్వ పాఠశాల చక్కటి పునాది అని తెలిపారు.

10న డిఎస్‌సి-98 ఉమ్మడి జిల్లా టీచర్ల సమావేశం

ప్రజాశక్తి - పోలవరం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డిఎస్‌సి 98 (ఎంటిఎస్) ఉపాధ్యాయుల సమావేశం ఈ నెల పదో తేదీ బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు తాడేపల్లిగూడెం జెడ్‌పిహెచ్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ నాయకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఎస్‌సి-98 ఉపాధ్యాయుల సమస్యలపై, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. సర్వసభ్య సంఘ ఏర్పాటు చేసేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిఎస్‌సి-98 (ఎంటిఎస్)లో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వై.సుబ్బారాయుడు, పి.బెనర్జీ, కె.మోహనరావు, తమ్మన ప్రభాకర్, కొణతాల నాగేంద్రప్రసాద్, వనజాకుమారి, కందుల దుర్గ పాల్గొన్నారు.

వడాలిలో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి శ్రీసుభద్ర బలరామ సహిత శ్రీజగన్నాథస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు వడ్డన చేసి అన్న సమారాధనను ప్రారంభించారు. ఈ సమారాధనలో వడాలి పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు విచ్చేసి స్వామివారి అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఈ సమారాధనలో ఐదువేల మంది పాల్గొన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ అన్నసమారాధనలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సమారాధనలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, ఆలయ ఛైర్మన్ మద్రివాడ సుబ్బలక్ష్మి, ఆలయ కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, శీలం రామకృష్ణ, ఎం.వీరారెడ్డి, కె.విష్ణువర్ధన్, మరీదు నాగయ్య, జంపాన కోటయ్య, సాయి, ఎం.రాంబాబు, సతీష్, కె.నాని, పల్లి శ్రీధర్, ఎస్ఐ షణ్ముఖసాయి పృధ్వి, కిషోర్ పాల్గొన్నారు.

PROCEEDINGS OF THE PRL. DISTRICT COURT, WEST GODAVARI : ELURU

Present: **Sri Purushottam Kumar Chintalapudi,** Principal District Judge, Eluru.

Sub: PUBLIC SERVICES - A.P.J.M.S.S Letter of the Special Judicial Magistrate of I Class (Excise), Eluru Informing that Sri. B.Avinash, Examiner has absconded from duties from 15-09-2020 - without any prior permission or leave Official Memorandum issued by the Officer could not be served on the individual, as the door was locked and the same was affixed to the house of the individual - Perused - Explanation of Sri B. Avinash, Examiner - Called for - Official memorandum was served to the mother of the individual - Explanation not submitted - Show cause notice - Issued.

Ref:- 1) G.O.Ms.No.129, Finance (FR.I) Department, dated 01-06-2007.
2) Letter in Dis.No.732, dated 17-09-2020 from the Special Judicial Magistrate of I Class (Excise), Eluru.
3) District Court's Official Memorandum in Dis. No.3236, dated 21-09-2020.
4) Letter in Dis. No.880, dated 12-10-2020 from the Special Judicial Magistrate of I Class (Excise Court), Eluru.
5) Office Note dated 18-11-2020 and Orders passed thereon.
6) District Court's Official Memorandum in Dis. No. 4370 dated 19-11-2020.
7) District Court's show-cause notice in Dis.No.6426 dated 03-12-2022.
8) Office note dated 24-03-2023 and orders thereon.

ORDER :: DATED :: 25-03-2023

Having perused the report of the Special Judicial Magistrate of I Class (Excise), Eluru under reference 2nd cited, explanation of Sri B.Avinash, Examiner was called for under reference 3rd cited, for your unauthorized absence from duties from 15-09-2020 without prior permission or leave and the Official Memorandum was served to your mother on 25-11-2020. It was recorded by the Process Server that your mother assured that she will give notice to you. It is held valid service. Thereafter came to that none residing, despite efforts notice returned. As per the record, you did not give any explanation. You remained absent to the office and duties for more than one year without any permission. No leave is granted.

Hence, you Sri **B.Avinash, Examiner,** Special Judicial Magistrate of First Class (Excise Court), Eluru, is hereby directed to show cause **within one week,** from the date of publication of this notice, as to why you shall not be removed from service under Rule 9(ix) of A.P.C.S (C.C.A) Rules, 1991, for unauthorized absence for more than one year, failing which, it will be treated that you have no cause to show and further action will be taken as per Rules.

Sd/- **C.Purushottam Kumar**
PRINCIPAL DISTRICT JUDGE, W.G., ELURU.